క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం మధుసూదనరావును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు నూతన హెచ్‌ఆర్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ మేనేజర్ ఎం. మధుసూదనరావును విశాఖ జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గురువారం సత్కరించారు. ఉక్కు పరిపాలన భవనంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపిన అనంతరం, పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎస్టీ అధికారులకు ఉన్నత స్థాయి పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్టు పనుల్లో అర్హత కలిగిన ఎస్టీలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్. అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కె. శోభన్‌కుమార్, రాథోడ్ తిలక్, ఎస్. శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కల్గించే ఆటోలపై చర్యలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ ముఖద్వారం వద్ద, అలాగే సిటీ బస్సులకు అడ్డంగా ఆటోలను నిలిపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఆటో స్టాండ్ డ్రైవర్లను పిలిచి ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఆటో స్టాండ్ కోసం కేటాయించిన స్థలంలో మాత్రమే ఆటోలను నిలపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ఇతర కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలను కూడా స్టేషన్ ఆవరణలోకి అనుమతించబోమని, ప్రవేశిస్తే జరిమానా విధిస్తామని ఆర్పీఎఫ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సహకరించాలని ఆయన ఆటో డ్రైవర్లను కోరారు.

జగన్నాథస్వామి రథోత్సవానికి ఏర్పాట్లు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో కొలువైన జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవ వేడుకలు ఈనెల జూన్ 27వ తేదీ (శుక్రవారం) నుండి వచ్చే నెల జూలై 6వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వాహక అధికారిణి (ఈవో) కె. పద్మావతి తెలిపారు. ఈ వేడుకలు శుక్రవారం తొలియాత్రతో ప్రారంభమవుతాయి. రథయాత్ర అనంతరం, ఇంద్రద్యుమ్నహాలు వద్ద స్వామివారు భక్తులకు దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించాలని ఈవో పద్మావతి కోరారు.

వారిపై క్రిమినల్ కేసులకు వినతి



పెదగంట్యాడ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వినియోగదారుల హక్కుల సంఘం

గాజువాక : ప్రజా పంపిణీ వ్యవస్థద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వినియోగదారుల హక్కుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది పెంటకోట వెంకట నాగేశ్వరరావు తమ సభ్యులతో పెదగంట్యాడ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యంను కొంతమంది దళారులు అక్రమంగా సేకరించి ప్రైవేట్ మిల్లులకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు, వినియోగదారుల హక్కులకు వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనివల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. రేషన్ బియ్యం అమ్మకాలను నిర్బంధంగా ఆపాలని, కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో సంఘం నాయకులు శ్రీనివాస్, కె.రవి, ఫణీంద్ర తదితరులున్నారు.

రథోత్సవానికి వేళాయె..



కళకళలాడుతున్న జగన్నాథ స్వామి ఆలయం

- నేటి నుంచి రథయాత్ర ప్రారంభం
- ఉత్సవాలకు సిద్ధమైన ఉక్కు జగన్నాథస్వామి ఆలయం
- ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక పూజలకు సన్నద్ధమైన భక్తులు



ఉక్కు జగన్నాథస్వామి ఆలయం



పూజలు అందుకుంటున్న, బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

ఉక్కునగరం: కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి గాంచిన స్టీల్‌ప్లాంట్ జగన్నాథస్వామి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఒడిశా ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు యాజమాన్యం సెక్టార్-9లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. 2001లో నాటి సీఎండీ బి.ఎస్. సింగ్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, 2003లో పూరీ రాజు దివ్య సింగ్ చేతుల మీదుగా ఆలయం ప్రారంభమైంది. పూరీలోని జగన్నాథస్వామి ఆలయాన్ని పోలి 70 అడుగుల ఎత్తులో ఈ ఆలయాన్ని నిర్మించారు. బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు కొలువై ఉన్న ప్రధాన ఆలయం చుట్టూ గణపతి, విమలాదేవి, మహాలక్ష్మి, హనుమాన్ ఉప ఆలయాలు ఉన్నాయి. పూరీ జగన్నాథ స్వామి ఆలయంలో మాదిరిగానే ఇక్కడ కూడా ఒడిశా పూజారులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఉత్సవాల ప్రత్యేకత

ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ ద్వితీయ నాడు బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు ఊరేగింపుగా సెక్టార్-8లోని ఇంద్రజుమ్న హాలులోకి వెళ్లి, అక్కడ తొమ్మిది రోజులు విశ్రాంతి తీసుకుని తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ రథోత్సవంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ బంగారు చీపురుతో రథాన్ని ఊడ్చడం ఆనవాయితీ. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశంలోని ప్రముఖ కళాకారులచే ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.

ఘనంగా ఏర్పాట్లు

నవరాత్రి ఉత్సవాల కోసం జగన్నాథస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూరీలో ఆదివారం నుంచి రథోత్సవాలు ప్రారంభం కానుండటంతో, స్టీల్‌ప్లాంట్‌లో కూడా అదే రోజు నుంచి ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వాహక కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జూలై 9 వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 7 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పూజలు నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఉక్కునగరం, పరిసర ప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలివస్తారని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాల వివరాలు

- 27న సాయంత్రం 3.30 గంటలకు రథయాత్ర,
- సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం
- ఒడిస్సీ, సంబల్‌పూర్ నృత్య ప్రదర్శన

- 28న సప్తేశ్వర భక్తి భజనలు
- 29న వైబ్స్ డ్యాన్స్ గ్రూప్ నృత్య ప్రదర్శన
- 30న కళానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన
- జూలై 1న శ్రీలక్ష్మి గ్రూప్ ఆధ్వర్యంలో కోలాటం
- 2న శ్రీ వేంకటరమణ గ్రూప్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం
- 3న ఒడిస్సా ఆర్కెస్ట్రా
- 4న గజముఖ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన
- 5న శశి కిరణ్ బ్లూ-1 డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
- 6న అగనంపూడి డ్యాన్సింగ్ టోస్ గ్రూప్ నృత్య ప్రదర్శన
- 7న రాత్రి 7 నుంచి 10 గంటల వరకు సమారాధన

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: 11కేవీ నోవాస్ ఫీడర్, 11కేవీ ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోవాస్ ఫీడర్ పరిధిలో నోవాస్ అపార్ట్‌మెంట్, డంపింగ్ యార్డ్ ఏరియా, ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణ కాంప్లెక్స్, నీలాపు వీధి, గొడ్డువానిపాలెం నోవాస్-పోర్టు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ఘనంగా కోదండరామ ఆలయ వార్షికోత్సవం



కోదండరామాలయంలో సీతారాములు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని పాత అగనంపూడిలో ఉన్న కోదండ రామాలయం 50వ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బొర్రమాం పారాయణ సేవా సమితికి చెందిన మహిళా బృందం లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఐ పార్థసారథి



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



డగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని భాస్కర్ విద్యానికేతన్ డైరెక్టర్ డైరెక్టర్ పాలవలస భాస్కరరావు కోరారు. మాదక ద్రవ్యాల వ్యతిరేకదినం కార్యక్రమాన్ని పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పెద్దవాళ్లకు మాత్రమే పరిమితమైన మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం ఇప్పుడు పాఠశాల విద్యార్థుల వరకు పాకిందన్నారు. మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

గాజువాక : విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని గాజువాక సీఐ పార్థసారథి అన్నారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత యువత మత్తు పదార్థాలకు బానిసలై చదువును, సమాజాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాలను వినియోగించేవారు వాటి దుష్ప్రభావాలకు గురి కావడమే కాకుండా సమాజంలో అవమానాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సాంఘిక వివక్షకు కూడా గురవుతారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంలేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, అధ్యాపకులు ఎస్.వి.కృష్ణ, వి.తేజేశ్వరరావు, సీహెచ్.రామ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

పెదగంట్యాడ: నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, బాగా చదువుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరులో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు మందుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరిలో డ్రగ్స్‌పై అవగాహన పెంపొందించడం ద్వారా వాటిని అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి 'సే ఎస్ టు లైఫ్.. నో టూ డ్రగ్స్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు సంతకాల సేకరణ కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, ఎల్-టి యాజమాన్యం, సృజన ఎన్జీవో ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం



వడ్లపూడి ప్రధాన రహదారిపై పొంగి ప్రవహిస్తున్న వర్షం నీరు

కూర్మన్నపాలెం : రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాల కారణంగా వడ్లపూడి ప్రాంతంలోని రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు, పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వడ్లపూడి ప్రధాన రహదారిపై వర్షపు నీరు పొంగిపొర్లడంతో దారి కనిపించని పరిస్థితి నెలకొంది. రహదారికి ఆనుకుని ఉన్న కాలువలు పొంగి, ఆ నీరు రోడ్డుపైకి చేరడంతో కొంత సమయం పాటు ప్రక్క దారుల గుండా వెళ్లాల్సి వచ్చింది. అనేక కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఎదురుకావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్లపై తీసిన గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో, ఎక్కడ అడుగు వేస్తే ఏ గుంతలో పడిపోతామోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందారు. గురువారం మధ్యాహ్నానికి వర్షం కొంత తెరిపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రధాన రహదారిపై నీరు చేరి పొంగి ప్రవహించడం వలన విధులకు వెళ్లేవారు, ఇతర పనులపై బయటకు వెళ్లేవారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనికి తోడు బురద మట్టి ఎక్కడ పడితే అక్కడ చేరిపోవడంతో వాహనాలు స్కిడ్డై జారిపడటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. వడ్లపూడి, కూర్మన్న పాలెంలోని అనేక నిర్వాసిత కాలనీలలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటం వల్లే ఇటువంటి పరిస్థితులు ఎదురవుతు న్నాయని స్థానికులు పేర్కొన్నారు. ప్రధానంగా మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అనేక గెడ్డలు ఆక్రమణలకు గురికావడం వల్లే నిర్వాసిత కాలనీలకు ఈ పరిస్థితి ఎదురైందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు గెడ్డల ఆక్రమణలపై దృష్టి సారించి, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నిర్వాసిత కాలనీల ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిని కాటేసిన 'కోబ్రా' పట్టివేత



పట్టుకున్న కోబ్రాతో కిరణ్‌కుమార్



కరెంటు మీటర్ వెనుక నక్కిన పాము

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఒక ఉద్యోగి మృతికి కారణమైన పామును ఎట్టకేలకు పట్టుకున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్-11లోని 103 బి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న ట్రాఫిక్ విభాగం ఉద్యోగి తగరంపూడి శ్రీనివాస్‌ను ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శ్రీనివాస్ మరణించినప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. పాము ఆ ఇంట్లోనే ఉందనే అనుమానంతో సోమవారం నుంచి క్వార్టర్‌లో, చుట్టుపక్కల పాము కోసం వెతకడం ప్రారంభించారు. స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్ కూడా సోమవారం క్వార్టర్‌ను మొత్తం పరిశీలించినా పాము జాడ దొరకలేదు. అయితే గురువారం ఉదయం ఆ పాము క్వార్టర్‌లో ఉన్న ఎలక్ట్రిక్ బోర్డు నుంచి బయటకు తొంగి చూడటంతో కుటుంబ సభ్యులు వెంటనే కిరణ్‌కు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా ఆ పామును పట్టుకున్నారు. అది అత్యంత విషపూరితమైన 'కోబ్రా' అని కిరణ్ నిర్ధారించారు. పామును పట్టుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

రహదారి నిర్మాణం పూర్తి



దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం వైపు పూర్తి చేసిన రహదారి పనులు

అగనంపూడి: రైల్వేస్టేషన్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలనే లక్ష్యంతో చేపట్టిన అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో ఇరుకుగా, ట్రాఫిక్‌తో నిత్యం రద్దీగా, గోతులతో నిండి ఉండే ఈ రహదారి ఇప్పుడు సరికొత్త రూపు సంతరించుకుంది. దాదాపు ఏడాది కాలంగా చేపట్టిన విస్తరణ పనులు, పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు, నాగదేవత కొండకు రక్షణగా నిర్మించిన గోడ, సీసీ కాల్వ పనులు పూర్తి కావడంతో ఈ మార్గం ఇప్పుడు ప్రయాణికులకు ఆహ్లాదకరంగా మారింది.అలాగే, ఆటో స్టాండ్, బస్టాప్ వద్ద కూడా బీటీ రోడ్డు వేయడంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టనున్నాయి. ఈ చర్యలతో ఇకపై ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపై నిలపాల్సిన అవసరం ఉండదు. దీంతో దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీరి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభించనున్నాయి.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఆధునికీకరణ పనులు

గాజువాక : గాజువాక, గంగవరం 220కేవీ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఆధునీకరణ పనులను శుక్రవారం ప్రారంభించనున్నట్టు ట్రాన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ పనులు వచ్చేనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఆధునీకరణ పనులు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతాయన్నారు. సాంకేతిక మరమ్మతులు చేపట్టిన సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే జిల్లాలోని నాలుగు ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మరమ్మతు పనులకు ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది ప్రణాళికబద్ధంగా పనులను చేపట్టారని, సాధారణ ప్రజల అవసరాలకు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే గాజువాక 220కేవీ, మల్కాపురం, నావల్, పోర్టు 132కేవీ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

దాబాగార్డెన్స్: వచ్చే నెల 9న సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ గురువారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ వంటి వాటిపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, పీఎంయూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు.

భక్తులు నడిచే దారి పొడవునా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ బయాలజిస్ట్ విభాగం అవసరమైన చోట్ల దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

ఏఐతో అందరికీ చేరువగా నాణ్యమైన విద్య



సదస్సులో పాల్గొన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ బృందం

మద్దిలపాలెం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో అట్టడుగు వర్గాలకు సైతం నాణ్యమైన విద్య చేరువవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) భువనేశ్వర్‌లో 'ఏఐ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ ఇన్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై జరుగుతున్న సదస్సులో గురువారం జేమ్స్ స్టీఫెన్ రెండు ప్రత్యేక ప్రసంగాలిచ్చారు. డిజిటల్ సాంకేతికత ఫలితంగా బి.ఆర్.అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు. విద్యా రంగంలోని సమస్యలకు పరిష్కారం చూపుతూ, సాంకేతికతను అనుసంధానం చేస్తూ సమానత్వాన్ని సాధించే విషయాలు, జరిగే ప్రయత్నాన్ని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల వారికి, అట్టడుగు వర్గాల వారికి విద్యను ఆధునిక సాంకేతిక విధానాలతో ఏ విధంగా చేరువ చేయవచ్చో వివరించారు. ఏఐ బోధనలో ఉపయోగించే విధానాలపై అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో భాగంగా ఐఐటీ భువనేశ్వర్‌లోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27 వరకు ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు. వివిధ విభాగాల అధ్యాపకులకు సమగ్ర విద్యా విధానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమన్వయం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.